క్లుప్తంగా

వైభవంగా తిరుప్పవ సేవ



వనపర్తి క్రైం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో గురువారం తిరుప్పవ సేవా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు అగ్ని ప్రతిష్ఠ, హోమశాలలో నిత్య హోమం, గరుడ ధ్వజారోహణం, తిరుప్పవ సేవా కార్యక్రమాలు ఘనంగా జరిపారు. సాయంకాలం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, నిత్యహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రఘునాథ చార్యులు, ప్రవీణ్ ఉన్నారు.

మినీ లిఫ్ట్ ద్వారా సాగునీరు



కొత్తకోట రూరల్: పెద్దమందడి శివారులో గల ఎత్తు ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశానుసారం రామ్‌కీ ఫౌండేషన్ సహకారంతో మినీ లిఫ్ట్ ద్వారా రైతులకు సాగు నీరు అందిస్తామని పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మినీ లిఫ్ట్ ద్వారా సాగు నీరు అందించేందుకు ఎత్తు ప్రాంతాలను ప్రొక్లెయిన్ సహాయంతో చదును చేశారు. రైతుల బాధలు తెలిసిన మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరవుతున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, కురుమూర్తి, గొల్ల మొగులయ్య, పులన్న, రాములు ఉన్నారు.

కార్యకర్తకు పరామర్శ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు నవీన్ ప్రమాదవశాత్తు కింద పడడంతో చేయి విరిగి పెబ్బేరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ గురువారం ఆస్పత్రికి వెళ్లి నవీన్‌ను పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అతడి వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుయాదవ్, కంభాళాపురం ఎంపీటీసీ ఎల్లస్వామి, సోషల్‌మీడియా కన్వీనర్ చంద్రశేఖర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణం పనుల పరిశీలన

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధుల ద్వారా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని పీఆర్ ఏఈ సత్తయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.16 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న జీపీ భవన నిర్మాణాన్ని నిబంధనల మేరకు నాణ్యతగా చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్మాణంలో నాణ్యత లోపిస్తే బిల్లుల చెల్లింపును నిలిపేస్తామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, తిరుపతియాదవ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలివెళ్లిన తపస్ నాయకులు

కొత్తకోట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వెంకటనారాయణ హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో గురువారం నామినేషన్ వేస్తున్న సంద్భంగా జిల్లా నుంచి తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నాయకులు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తపస్ ముందుంటుందని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థినే ఉపాధ్యాయులు భారీ మెజారిటీతో గెలిపిస్తారని తపస్ జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో విష్ణువర్ధన్, రాఘవేంద్రచారి, ప్రభాకర్, దామోదర్‌రెడ్డి, తిరుపతినాయక్, శివర్ధన్, భాస్కర్, ధనుంజయ్‌గౌడ్, వెంకటేష్, లక్ష్మయ్య, కేశవులు, రాజశేఖర్, రాములు తదితరులు ఉన్నారు.

పేదలపై భారం తగదు

వనపర్తి క్రైం: దేశంలో ప్రజల జీవితాలపై మోపుతున్న ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడారు. కేంద్రంలో బీజేపి ప్రభుత్వం దేశ ప్రజలపై భారాలు వేస్తూ.. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తున్నా రని విమర్శించారు. అలాగే మతోన్మాదాన్ని పోషిస్తూ.. మతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతూ అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఆహారం, మందులపై జీఎస్టీ రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుట్టా ఆంజనేయులు, బాల్‌రెడ్డి, కురుమయ్య, రమేష్, రాములు ఉన్నారు.



శంభో శంకరా.. పాహిమాం



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

ఆత్మకూర్: పట్టణం శివారులోని చెరవులో వెలసిన శ్రీశ్రీ స్వయంభు పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చి పులుసు, అన్నాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా వేలాది మంది భక్తులు స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి రథోత్సవంపై విగ్రహాలు ఉంచి తేరు లాగారు.

ప్రముఖుల పూజలు

అనంతరం ప్రముఖ పూజారి కర్ణసయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ బంగారుశ్రీను, జెడ్పీటీసీ శివరంజని, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్లరామకృష్ణ, పోశన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సూం, రైతుసంఘం అధ్యక్షుడు విరేశలింగం, వైస్ ఎంపీపీ కోటేష్, అనిల్‌కుమార్‌గౌడ్, గడ్డమీది శ్రీను ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన కర్ణాటక కళాకారులు

జాతర సందర్భంగా తేరుకు కర్ణాటకలోని తూంకూర్‌కు చెందిన ప్రముఖ వీరగాసే కళాకారుల నిర్వహించిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి, గాంధీచౌక్‌లో అగ్నిజ్వాలల్లో శులాలు గుచ్చుకునే దృశ్యాలు భక్తులను అబ్బురపరచాయి. భాజభజంత్రీలు, డప్పువాయిద్యాలు, బాణసంచా ప్రదర్శనలు నిర్వహించారు. ఎస్‌ఐ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



జాతరకు హాజరైన భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి

'దొరబావి'ని ఆధునీకీకరిస్తాం

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని రాజుల కాలం నాటి దొరబావిని ఆధునీకరించడానికి కావల్సిన నిధులను సమకూర్చుతామని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులోని దొరబావిని తహసీల్దార్ సింధూజతో కలిసి పరిశీలించారు. ఈ బావి రాజుల కాలంలో ఎంతో సుందరంగా నిర్మించారని, అనంతరం మరుగున పడిందన్నారు. ప్రస్తుతం బావిని ఆధునీకరించి రాత్రివేళల్లో లైటింగ్ ఏర్పాటు చేసి, రంగులతో ముస్తాబు చేస్తామన్నారు. అలాగే రూ.3.50 కోట్ల పీఎఫ్‌ఐడీసీ నిధులతో మున్సిపాలిటీ పరిధిలోని 10వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తున్నామని, త్వరలోనే ఈకార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ తదితరులు ఉన్నారు.



దొరబావిని పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానివ్వం

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరు, అయ్యవారిపల్లి, వెలటూరు గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్యను స్థానిక కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సమస్యను వెంటనే పరిష్కరించాలని వాటర్ గ్రిడ్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. గురువారం వాటర్ గ్రిడ్ ఎస్సీ వెంకటరమణ, డీఈ రమేశ్ ఆయా గ్రామాలకు వచ్చి నీటి సమస్యను పరిష్కరించారు. మిగతా ఏమైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ రామాంజనేయులు, ఉపసర్పంచ్ ఆనంద్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ మార్చాలని ఆందోళన

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని ఎల్‌టీ విద్యుత్ లైన్‌ను వెంటనే మార్చాలంటూ కాలనీకి వచ్చిన ట్రాన్స్‌కో ఏడీ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజాను కాలనీవాసులు నిలదీసిన సంఘటన గురువారం చోటుచేసుకోంది. శ్రీకృష్ణనగర్‌లో ఇళ్ల మధ్య నుంచి వెళ్తున్న ఎల్‌టీ విద్యుత్ హైటెన్షన్ లైన్ ద్వారా బుధవారం రాత్రి పలువురి ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు కాలిపోవడంతో ట్రాన్స్‌కో ఏడీ రాంనారాయణరెడ్డితో పాటు ట్రాన్స్‌కో ఏఈ, లైన్‌మెన్లు పరిశీలించడానికి కాలనీకి వచ్చారు. వీరితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారు. దీంతో కాలనీవాసులు వార్డు కౌన్సిలర్ విజయరాములు కలిసి విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ పట్టుబట్టారు. ఈ వ్యవహారంలో చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా జోక్యం చేసుకొని లైన్ మార్చేందుకు అయ్యే ఖర్చును వెంటనే అంచనా వేస్తామన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి చొరవతో సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది. కార్యక్రమంలో నాగభూషణంగౌడ్, ట్రాన్స్‌కో ఏఈ రాంచందర్, లైన్‌మెన్ రాజు, తిరుమలేష్, చింతకుంట వెంకటేష్, బొగ్గు రఘు, అంజనేయు ఉన్నారు.



ట్రాన్స్‌కో, మున్సిపల్ అధికారులతో వాగ్వాదం చేస్తున్న కాలనీవాసులు

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన మహేశ్వరి తన భర్త రామకృష్ణ వేధిస్తున్నాడని గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీష్ రెడ్డి తెలిపారు. వీరికి 16ఏళ్ల క్రితం వివాహం జరగగా.. ముగ్గురు పిల్లలు ఉన్నారు. అత్త భారతమ్మ, భర్త రామకృష్ణ అనుమానంతో వేధిస్తున్నారని గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీలు నిర్వహించినా వారిలో మార్పు రాకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు భర్త రామకృష్ణను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి గ్రామానికి పంపించగా అక్కడ భర్త, అత్త గొడవపడి తీవ్రంగా కొట్టారు. బాధితురాలు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో భర్త రామకృష్ణ, అత్త భారతమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'పది' విద్యార్థులు పరీక్షపై దృష్టి సారించాలి

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికతో చదివి వంద శాతం ఫలితాలు సాధించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని శాగాపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయుల సూచన మేరకు సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. పాఠశాలల్లో మన ఊరు–మన బడి పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు గీత, వెంకటస్వామి, సీఆర్పీ గోవింద్ నాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

ప్రైవేట్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

వనపర్తి: ప్రైవేట్ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం వనపర్తి జిల్లా కార్యదర్శిగా ఆర్ శైలజ ఎంపికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాములు తదితరులు ఉన్నారు.

కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు

అమరచింత: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులకు కలెక్టర్ ఆదేశానుసారం గురువారం వైద్య పరీక్షలు నిర్వహించామని డాక్టర్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతత, పౌష్టికాహారం, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పిస్తూ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో మొత్తం 267 మంది విద్యార్థినులు ఉండగా.. 138 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారన్నారు. రక్తహీనత పిల్లల సంఖ్య 12, జ్వరం బారిన ఐదుగురు, జలుబు, దగ్గులతో 31 మందిని గుర్తించామన్నారు. వీరితో పాటు చర్మ సంబంధిత వ్యాధులు ఉన్నవారు 37 మంది ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా 35 మందితో రక్త నమూనాలను సేకరించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ కవిత, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం మొబైల్ టీం ఫార్మసిస్ట్ యాదయ్య, ఆరోగ్య కార్యకర్త చిలుకమ్మ, హెల్త్ కౌన్సిలర్ రవి, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, ఏఎన్‌ఎం శారద తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 179 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో జలుబు, జ్వరం ఉన్న వారికి మాత్రలు ఇచ్చారు. ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే ఉపాధ్యాయులకు చెప్పాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ సునీల్ చెప్పారు. అంతే కాకుండా భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ దీప్తి, సూపర్‌వైజర్ కౌసల్య, వైద్య సిబ్బంది వెంకటమ్మ, శాంతిభూషణ్, శివ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య క్యాంపును గురువారం జిల్లా వైద్యాధికారి రవిశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయించి, సమస్యలు ఉన్నవారికి తగిన మందులు ఇవ్వనున్నామని తెలిపారు. వారి నుంచి రక్త నమూనాలు సేకరించి, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, అనురాధ, ఏఎన్‌ఎమ్‌లు లావణ్య, ప్రశాంతి, కళాశాల ప్రిన్సిపాల్ అనుకరణ, స్వర్ణలత, ఆశా కార్యకర్తలు సువర్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం



గోపాల్‌పేట కస్తూర్బా పాఠశాలలో..



పెబ్బేరు బీసీ గురుకుల పాఠశాలలో..

కేజీబీవీలో సమస్యలు పరిష్కరిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీలు కనీస వసతులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్న వైనాన్ని సాక్షి దినపత్రికలో 'సమస్యలు పరిష్కరించండి సారూ' అనే శీర్షికన గురువారం వెలుగులోకి తెచ్చింది. స్పందించిన డీఈఓ రవీందర్ గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. 192 మంది బాలికలు చదువుతున్న ఈ పాఠశాలలో మూడు మరుగుదొడ్లు ఉన్న విషయాన్ని పరిశీలించిన ఆయన సమస్యను పరిష్కరిస్తామన్నారు. కేజీబీవీ ఆవరణలో నిర్మించిన అదనపు మరుగుదొడ్లకు కొద్దిపాటి మరమ్మతు చేయించాల్సి ఉందని, వారం రోజుల్లో వాటిని పూర్తి చేసి ఇబ్బందులు తొలగిస్తామని తెలిపారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోకుంటే చర్యలు తీసుకుంటామని పాఠశాల ఎస్‌ఓ స్వప్నకు హెచ్చరించారు. పాఠశాల ప్రధాన గేటుకు వెంటనే మరమ్మతు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ నర్సింహారెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాడైన పాఠశాల పాఠశాల గేటును పరిశీలిస్తున్న డీఈఓ రవీందర్

జీవాలకు నట్టల నివారణ మందులు

ఆత్మకూర్: మండలంలోని ఆరేపల్లి, తూంపల్లి గ్రామాల్లో గురువారం పశువర్ధకశాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అనసూయమ్మ, లక్ష్మీకాంత్‌రెడ్డి, పశువర్ధకశాఖ ఏడీ శ్రీనివాసులు, డాక్టర్ రమేష్, జేఈవోలు నిర్మల, ఇంద్రజ, సిరాజుద్దీన్, మహిమూద్, సిబ్బంది పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని కిష్టంపల్లి, నందిమళ్ల గ్రామాల్లో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామని పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. రెండో రోజు కిష్టంపల్లిలో 2,697 గొర్రెలు, 221 మేకలు, నందిమళ్లలో 5,282 గొర్రెలు, 481 మేకలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందులను గొర్రెలు, మేకలకు కాపరులు తప్పనిసరిగా తాగించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ సుసాన్‌కేసి అన్నారు. గురువారం ఖిల్లాఘనపురంలో 7,306 గొర్రెలు, 359 మేకలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో కాపరులు నాగరాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



తూంపల్లిలో నట్టల నివారణ మందులు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

'ఉపాధి' కూలీలకు వసతులు కల్పించాలి

కొత్తకోట: మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల్లో పనిచేస్తున్న కూలీలకు పని జరిగే ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని, అదే విధంగా ప్రతి కూలీకి రూ.600 చొప్పున చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కానాయపల్లి శివారులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు నిక్సన్ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి వసతి, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచేవారని, ప్రస్తుతం అలాంటి సౌకర్యాలు సమకూర్చకపోవడం చూస్తుంటే ప్రభుత్వం కూలీల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు. అంతే కాకుండా కూలీలు గడ్డపారలను పదును చేయించుకునేందుకు అదనంగా డబ్బులు, ఎండా కాలంలో కూలీ పనిచేస్తే పనికి 30శాతం అదనంగా ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం అదనపు బిల్లులు ఇవ్వకుండా కూలీల శ్రమను ప్రభుత్వాలు దోపిడి చేస్తున్నాయని మండిపడ్డారు. ఉపాధి హామీ కూలీలను నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో కూలీలు కృష్ణమ్మ, రాములమ్మ, శివలీల, కృష్ణవేణి, యశోద, రంగమ్మ, చంద్రమ్మ ఉన్నారు.



మాట్లాడుతున్న నిక్సన్

ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర

వనపర్తి టౌన్: బీజేపీకి అనుసంధానంగా ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు ఓ న్యాయం, కాంగ్రెస్ నాయకులకు మరో న్యాయం అనే తరహాలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు పని చేస్తున్నాయని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడుపదుల వయస్సు దాటి అనారోగ్యంతో బాధపడుతున్న ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీని ఈడీ విచారించేందుకు కార్యాలయానికి రావాలని నోటీసులు ఇస్తుందని, మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను మాత్రం ఆమె ఇంటికి వెళ్లి విచారించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార చైర్మన్ యాదగిరి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, మన్నెంకొండ, సమద్, పెంటన్న, దివాకర్, నరసింహ ఉన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్‌యాదవ్

అందరి సహకారంతోనే అభివృద్ధి

కొత్తకోట రూరల్: వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని రైతుబంధు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి అధికారులకు సూచించారు. వైస్ ఎంపీపీ రఘుప్రసాద్ అధ్యక్షత నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా రైతుబంధు అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ నల్లాలను ఇచ్చారని, వాటి ద్వారా నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఉంటే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అఫ్జల్ ఉన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి

గాడ్గేబాబాకు ఘన నివాళి

వనపర్తి టౌన్: జంతువులపై ప్రేమ కలిగి ఉండాలని, నిమ్న కులాల ఎదుగుదలకు పాటుపడాలని గాడ్గేబాబా నిరంతరం తపించేవాడని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ గుర్తుచేశారు. ఈ మేరకు సంత్ గాడ్గేబాబా జయంతి సందర్భంగా టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, డప్పు నాగరాజు, ప్రజాప్రతినిధులు బాలస్వామి నాయుడు, దేవన్న నాయుడు, రాముడు, కురుమూర్తి, దాసరాజు, ప్రవీణ్ ఉన్నారు.

కొత్తకోట: స్థానిక చౌరస్తాలో సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి మున్సిపాల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, కౌన్సిలర్లు, రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఎంపీపీ గుంత మౌనిక, కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, వెంకటేష్, చంద్రయ్య, బాలరాజు, మహేష్ ఉన్నారు.

అర్హులందరికీ ఉపాధి హామీలో పని కల్పించాలి

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని కేశంపేట, నాగపూర్ గ్రామాల్లో గురువారం జెడ్పీసీఈఓ శ్రావణ్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా కేశంపేట వద్ద ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో భాగంగా కట్ట వెంట కంపచెట్ల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. అంతేకాకుండా నాగపూర్‌లోని నర్సరీని విజిట్ చేసి మొక్కల పెంపకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు చనిపోతే వెంటనే వాటి స్థానంలో కొత్త మొక్క నాటి పెంచాలని సూచించారు. మొక్కల చనిపోకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ భవాణి, సెక్రెటరీలు పాల్గొన్నారు.



'ప్రజావ్యతిరేక పాలనను సాగనంపుదాం'

ఖిల్లాఘనపురం: తెలంగాణలో ప్రజావ్యతిరేక పాలన సాగుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఏకమై ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని తిర్మలాయపల్లి, సోళీపురం గ్రామాల్లో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు ఈశ్వరయ్య, రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదల కోసం ఆయుష్మాన్ భారత్, ఉచిత రేషన్ బియ్యం ఇలా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. దేశ ప్రజల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అందిస్తున్న పథకాలను రాష్ట్రంలోని పేద ప్రజలకు అందకుండా తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. రుణమాఫీ సంగతి పక్కన పెట్టి రైతులను మోసగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, రాంరెడ్డి, గోపినాయక్, గోపాల్‌రెడ్డి, రాంచందర్ పాల్గొన్నారు.